పొచ్చెర జలపాతం వద్ద రక్షణ చర్యలు

లైఫ్ జాకెట్లు అందజేస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అమర్ సింగ్

బోథ్, డిసెంబర్ 30 : మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు జలపాతం ఇన్‌చార్జి, సొనాల సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అమర్ సింగ్ తెలిపారు. సోమవారం జలపాతం వద్ద ప్రమాదాల నివారణ కోసం వచ్చిన సిబ్బందికి లైఫ్ జాకెట్లు అందజేశారు. గజ ఈతగాళ్లను కూడా త్వరలో నియమిస్తామన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు నాగోరావ్, ముంతాజ్, ధన్‌రాజ్, విఠల్, చించోలి, వీఎస్ఎస్ చైర్మన్ విఠల్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్/భైంసా, డిసెంబర్ 30: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ సహకారంతో ఆన్‌లైన్‌లోనే ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాళ్లు ప్రతాప్ సింగ్, కర్రోల్ల బుచ్చయ్య సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సెమీ కండక్టర్ల చిప్ తయారీపై ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ కోసం ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఐటీ, సాఫ్ట్‌వేర్ తత్సమాన సాంకేతిక కోర్సులో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, యూజీ, పీజీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 31వ తేదీలోగా http://www.skillindiadigital. gov.inలో నమోదు చేసుకోవాలని సూచించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

భైంసా, డిసెంబర్ 30 : ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ గోపినాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.డిసెంబర్ 31 వేడుకలు ఇళ్లలోనే జరుపుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలతో రోడ్లపైకి రావద్దన్నారు. 31న రాత్రి పట్టణంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, నిబంధనలు అతిక్రమించినా, మద్యం తాగి వాహనాలు నడిపిన, యువత హద్దులు దాటినా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. అంతేగాకుండా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయినా సరే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు.

ఇంద్రవెల్లి, డిసెంబర్ 30: డిసెంబర్ 31న రాత్రి 7 గంటల నుంచి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్ పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ, ట్రిపుల్ రైడింగ్ చేసిన, అతివేగంతో బండి నడిపిన, కేకలు పెడుతూ రోడ్లపై వాహనాలు నడిపిన కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

భైంసాటౌన్, డిసెంబర్ 30 : కొత్త సంవత్సర వేడుకలను సంబురంగా నిర్వహించుకోవాలని రూరల్ సీఐ నైలు ఒక ప్రకటనలో తెలిపారు. 31న రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై వేడుకలు నిర్వహించరాదని పోలీసు బృందాలు నిరంతరం గస్తీలు తిరుగుతూ, ప్రమాదాలు జరుగకుండా వాహనాలను తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. డీజే, లౌడ్ స్పీకర్లు పెడితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ముధోల్, డిసెంబర్ 30 : పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సంజీవ్ కుమార్ అన్నారు. డిసెంబర్ 31 సెలబ్రేషన్స్, నూతన సంవత్సర వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు.

దస్తురాబాద్, డిసెంబర్ 30 : నూతన సంవత్సర సంవత్సర వేడుకల పేరిట ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శంకర్ హెచ్చరించారు. ప్రజలు తమ ఇండ్లలో సురక్షితంగా వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

శాంతిభద్రతలు అందిస్తాం

● ఎస్పీ జానకీషర్మిల ● నిర్మల్ జిల్లాలో ఏడాదిలో 3524 కేసుల నమోదు

మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 30: నిర్మల్ జిల్లా ప్రజలకు శాంతి భద్రతలు అందిస్తామని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల అన్నారు. సోమవారం నిర్మల్‌లోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్షిక క్రైమ్ నివేదికను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గతేడాదితో పోల్చితే క్రైమ్‌రేట్ పెరిగినప్పటికీ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించామన్నారు. జిల్లాలో ట్రాఫిక్ రద్దీ పెరిగిన దృష్ట్యా నిర్మల్ టౌన్, భైంసాలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు, అలాగే నిర్మల్‌లో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బాసర గోదావరిలో భక్తుల ఆత్మహత్యలను నివారించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతామన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల అండగా ఉండి వారిలో భరోసా నింపేందుకు బాసర ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా విడిపోయిన 200 జంటలను కలిపామని జిల్లాలో మరో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని గంజాయి సాగు చేసిన, విక్రయించిన వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని అన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసినట్లయితే మీ ఖాతాలో ఉన్న నగదును సంరక్షిస్తున్నామన్నారు. జిల్లాలో సంచలనం సృష్టించిన బిట్ కాయిన్ దందాపై పోలీసులు ఉక్కుపాదం మోపడం జరిగిందని ప్రస్తుతం ఈ కేసు ఈడీ పరిధిలోకి వెళ్లిందని అన్నారు. వీటితో పాటు అనేక సంక్షేమ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీలు ఉపేందర్ రెడ్డి, అవినాశ్, డీఎస్పీ గంగా రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో కేసుల వివరాలు...

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 3524 కేసులు నమోదయ్యాయని ఇందులో అత్యధికంగా నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో 599 కేసులు నమోదు కాగా అత్యల్పంగా పెంబి పోలీస్ స్టేషన్‌లో 75 కేసులు నమోదయ్యాయి.16 హత్య కేసులు నమోదు కాగా...39 మందిపై లైంగిక దాడి కేసులు నమోదయ్యాయి.466 దొంగతనం కేసుల్లో రూ.2,19,09,577 సొత్తును దోచుకెళ్లగా వీటిలో రూ.63.70 లక్షల సొత్తును రికవరీ చేశారు. 40 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయి. 390 రోడ్డు ప్రమాదాలు జరుగగా 133 మంది చనిపోయారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు జాబ్‌మేళాను నిర్వహించి 662 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

ప్రజావాణికి అధికారుల డుమ్మా..

ప్రజావాణిలో పాల్గొన్న తహసీల్దార్ శివరాజ్‌తో పాటు ఆర్‌అండ్‌బీ శాఖ ఉద్యోగి

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 30: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి అధికారులు డుమ్మా కొడుతున్నారు. ప్రతి వారం నిర్వహించే ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలి. కానీ సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఉదయం 11.30గంటల వరకు కేవలం తహసీల్దార్ శివరాజ్‌తో పాటు ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి జూనియర్ అసిస్టెంట్ రమణ మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు పాల్గొనకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ప్రతి వారం జరిగే ప్రజావాణికి సకాలంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 30 : ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్‌లోని మహా ప్రజ్ఞా బుద్ధ విహార్‌లో జనవరి 1వ తేదీన నిర్వహించే 206వ భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమతా సైనిక్ దళ్ జాతీయ కన్వీనర్ గౌరవ దిగంబర్ కాంబ్లే, జాతీయ ప్రధాన కార్యదర్శి షాన్ రేంజర్ల రాజేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేశ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, దళితులు, తదితరులు తరలిరావాలని కోరారు. సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమరావ్ వాగ్మారే, ఎస్సీఆర్పీఎస్ యూత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు రాజుమస్కే పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 30 : ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన సోమవారం సిరికొండ మండలంలో చోటు చేసుకుంది. సిరికొండ మండలంలోని చిమన్‌గుడి గ్రామానికి చెందిన ఈశ్వర్(43) తన సొంత వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఎడ్లను నీళ్లు తాగించేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాం తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

నేరడిగొండ, డిసెంబర్ 30 : బుద్దికొండ గ్రామానికి చెందిన సాయిచరణ్(23) డంప్ యార్డు సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నేరడిగొండ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం. .గ్రామంలో ఇటీవల హైమాక్స్ లైట్లను కొందరు పగులగొట్టడంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీడీసీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మృతుడి బంధువులు ఆందోళన చేశారు. దీంతో డీఎస్పీ నాగేంద్ర కల్పించుకొని మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో శాంతించారు. అనంతరం శవాన్ని పంచనామా నిర్వహించి అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడెం వాగులో పత్తి వాహనం బోల్తా

కడెం వాగులో బోల్తా పడ్డ పత్తితో నింపిన ఐచర్ వాహనం

పెంబి, డిసెంబర్ 30: మండలంలోని హరిచంద్‌తండా గ్రామానికి చెందిన రైతు గుగ్లావత్ రాజేశ్వర్ దాదాపు 40 క్వింటాళ్ల పత్తిని ఐచర్ వాహనంలో తీసుకొని నిర్మల్‌కు వెళ్తున్నాడు. కడెం వాగు దాటే క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఎలాంటి ప్రాణాహాని కలగకపోగా, వాహనంలో తీసుకెళ్తున్న పత్తి నీటిలో తడిసిపోవడంతో రైతు ఆవేదన చెందుతున్నాడు.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు

దొంగతనం కేసులో పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తులు

లక్ష్మణచాంద, డిసెంబర్ 30: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం తిరుపెల్లి గ్రామానికి చెందిన వినయ్, దేశపోయిన సుకుమార్, శివరాత్రి భూమేశ్‌ను దొంగతనం కేసులో సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీలత తెలిపారు. వివరాలు ఇలా ఉండగా... చింతల్‌చాంద గ్రామానికి చెందిన రైతు నక్కల అన్వేశ్ గ్రామ శివారులో గల వినాయక టెంపుల్ సమీపంలో రోడ్డుపై వడ్ల బస్తాలను నింపి పెట్టాడు. వినయ్, సుకుమార్, భూమేశ్ ఎవరు లేని సమయం చూసి దొంగతనంగా వడ్ల సంచులను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా వారిని చూసి రైతు అన్వేశ్ ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నాడు. ముగ్గురు వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

ఎస్పీతో గోడు వెల్లబోసుకుంటున్న కుటుంబీకులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 30: ఆత్మహత్య చేసుకున్న వంశీకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల హామీ ఇచ్చారు. నిర్మల్‌లోని నాయుడివాడ కాలనీకి చెందిన కొర్తికంటి వంశీకృష్ణ పార్ట్‌నర్‌షిప్‌ల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని వారిని అరెస్టు చేయాలని సోమవారం వంశీకృష్ణ కుటుంబీకులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీషర్మిలను కలిశారు. నిందితుల కోసం రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలిస్తున్నామన్నారు. త్వరలోనే వారిని పట్టుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

బైక్, ట్రాక్టర్ ఢీ: ఒకరికి గాయాలు

నర్సాపూర్(జీ), డిసెంబర్ 30: నర్సాపూర్(జీ) మండలంలోని రాంపూర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి, దిలావర్‌పూర్ మండలం కదిలి గ్రామానికి చెందిన కరడే నాందేవ్ బైక్‌పై నిర్మల్‌కు వెళ్తున్నాడు. రాంపూర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో నాందేవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నాందేవ్ కుమారుడు పాపేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు.

పశువుల పాక, గడ్డి వాము దగ్ధం

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 30: ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు పశువుల పాక, గడ్డివాముకు నిప్పంటించారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన రాసమల్ల బాస్కర్ గడ్డివాముతో సహా పశువుల పాక సైతం బుడిద అయిందన్నారు. సుమారు రూ, లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలన్నారు.

నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి బదిలీ

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 30 : నిర్మల్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న గంగారెడ్డిని బదిలీ చేస్తూ సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నిర్మల్ ఏఎస్పీగా గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన రాజేశ్ మీన రానున్నారు. గంగారెడ్డిని హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

స్వామి వివేకానంద పుస్తకాలు అందజేత

ఎదులాపురం, డిసెంబర్ 30 : ఆదిలాబాద్ మండలం ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు స్వామి వివేకానంద స్వామి పుస్తకాలను సోమవారం సామాజిక సేవకుడు, విద్య ఉద్యోగ మార్గదర్శకుడు కౌటిక శ్రీనివాస్ అందజేశారు. విద్యార్థులు స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో చదువుకొని జీవితంలో విజయం సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రదర్శన

బోథ్, డిసెంబర్ 30: ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి బోథ్ మండల పరిధిలోని ఓటర్ల తుది జాబితా సోమవారం ప్రదర్శించినట్లు తహసీల్దార్ సుభాష్ చందర్ తెలిపారు. పట్టభద్రుల పోలింగ్ కేంద్రం 78, 79, ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రం 47లో ఓటర్ల జాబితా పత్రాలు అతికించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఫారం-16ను పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటితో పాటు తహసీల్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్, డీటీ సూరజ్ పాల్గొన్నారు.

తాంసి, డిసెంబర్ 30: గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ తుది ఓటరు జాబితాను ఓటర్లు సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 44 వద్ద ఓటరు జాబితాను సోమవారం ప్రదర్శించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్లు రాఘవేంద్ర, ప్రవంతి ఉన్నారు.

జిల్లా అధికారుల సంక్షేమ సంఘం కార్యవర్గం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 30: నిర్మల్ జిల్లా అధికారుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, అధ్యక్షుడిగా జిల్లా పరిషత్ సీఈవో గోవిందు జిల్లా అధికారులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహ అధ్యక్షుడిగా జీవరత్నం, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, అశోక్ కుమార్, సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్ కుమార్,సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రాంగోపాల్, కోశాధికారిగా అంబాజీ, పబ్లిసిటీ సెక్రటరీగా విష్ణువర్ధన్, సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన హమాలీ రేట్లు అమలు చేయాలి

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 30: సివిల్ సప్లయ్‌లో పని చేస్తున్న కార్మికులకు నూతన హమాలీ రేట్లు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల భూమేశ్ అన్నారు. సోమవారం నూతన హమాలీ రేట్ల పెంపు అమలులో జాప్యంపై తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. 1 జనవరి 2025 నుంచి తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరవధిక సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిల్లి రమేశ్, నాగన్న, చిన్నయ్య, స్వామి, శ్రీను, ప్రేమ్, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

భీంపూర్, డిసెంబర్ 30: బేల్సరిరాంపూర్ గ్రామంలో భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి 105 జట్లు తలపడుతున్నాయి. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మొదటి బహుమతిగా రూ.25 వేలు అందజేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

లాడ్జీలను తనిఖీ చేస్తున్న ఏఎస్పీ

బాసర, డిసెంబర్ 30 : పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం పరిసరాల్లో లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే యజమానులపై చర్యలు తప్పవని భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం బాసరలోని పలు లాడ్జీలను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల వ్యవస్థ, రిజిస్టార్‌లను పరిశీలించారు. అనంతరం గోదావరి బ్రిడ్జి వద్ద గల సీసీ కెమెరాలను పరిశీలించారు. బాసర పోలీస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాసర పుణ్యక్షేత్రానికి భక్తులు వస్తుంటారని, ఇదే అదునుగా భావించి కొందరు లాడ్జీ యజమానులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను గమనించిడంతో ఇద్దరు లాడ్జి యజమానులపై ఫోక్సో కేసు నమోదు చేశామన్నారు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన వారు ఇక్కడ పట్టుపడగా ఓ లాడ్జి యజమానిపై మొఘల్‌పుర పోలీస్టేషన్‌లో ఫోక్సోకేసు నమోదైందని తెలిపారు. ఆధార్‌కార్డుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసిన తర్వాతనే గదులను అద్దెకు ఇవ్వాలని, లాడ్జీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏఎస్పీ వెంట సీఐ మల్లేశ్, ఎస్ఐ గణేశ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, డిసెంబర్ 30: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. గాదిగూడ మండలం సిద్వం గ్రామానికి చెందిన లక్ష్మీబాయి తనకు త్రీఫేజ్, బోర్‌వెల్ మంజూరు చేయాలని, నార్నూర్‌కు చెందిన కిరణ్ కుమార్ కారు లోన్ ఇప్పించాలని, ఉట్నూర్ మండలం మారుతిగూడ గ్రామానికి చెందిన రుక్మాబాయి బోర్ మరమ్మతుల చేయించాలని, అలాగే వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు రెండు పడకల ఇండ్లు కావాలని, స్వయం ఉపాధి కావాలని, వ్యవసాయ పనిముట్లను రాయితీపై ఇవ్వాలని కోరారు. ఈ దర్బార్‌లో ఏపీవో జనరల్ వసంత్‌రావ్, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

ట్రాకర్ డాగ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎదులాపురం, డిసెంబర్ 30: ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో టూ టౌన్ పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలతో సోమవారం రాత్రి తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను నార్కోటిక్, ట్రాకర్ డాగ్‌తో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకే తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నార్కోటిక్ డాగ్‌తో గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టవచ్చన్నారు. సీఐ వెంట కానిస్టేబుల్ ఉన్నారు.

హైదరాబాద్ యాత్రకు అనుమతి ఇవ్వండి

కుంటాల, డిసెంబర్ 30 : ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర డిసెంబర్ 31న హైదరాబాద్‌లో ముగింపు కార్యక్రమంలో పాల్గొనడానికి అనుమతి ఇవ్వాలని కుంటాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శృతికి ఆశ కార్యకర్తలు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆశ కార్యకర్తలులు ఇంద్రమాల, శకుంతల, ప్రతిభ, అనురాధ, తదితరులు ఉన్నారు

సేవా పురస్కారాలు అందుకున్న కవులు, కళాకారులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 30 : నిర్మల్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో ప్రముఖ కంటి వైద్యులు కృష్ణం రాజు సౌజన్యంతో పాటే మా ప్రాణం సంగీత అకాడమీ వారు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కవులు కళాకారులకు నిలయమని కళాకారులను సన్మానించుకోవడం సంతోషకరమని అన్నారు. డాక్టర్ వేణుగోపాల కృష్ణ, రామకృష్ణ, శుభకరణ్, ప్రభాకర్, రవి, మోహన్, శోభ, గోపి, మనోహర్, ఒకర్ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ఎంసీ లింగన్న, చిన్నయ్య, వేణువర్మ, రాజ్ కుమార్, నాగరాజు, శ్రీకాంత్, కవిత పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఇచ్చోడ, డిసెంబర్ 30 : మండల కేంద్రంతో పాటు సిరిచెల్మ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై దాడులు చేసి మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎండీ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ.10 వేలు ఉంటుందని పేర్కొన్నారు. బెల్టు షాపు నిర్వాహకులు రాజేశ్వర్, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్

ఉట్నూర్,డిసెంబర్ 30: ఉట్నూర్ డివిజనల్ పోల